www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం, 08, ఏప్రిల్, 2026



# ప్రజారోగ్యమే లక్ష్యం

- ఆరోగ్య ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ప్రతి ఒక్కరూ ఆరోగ్య స్పృహ కలిగి ఉండాలి
- ఎంపీ గోడం నగేష్




**అక్షిత ప్రతినిధి/ అదిలాబాద్:** ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మిగతా.. 2లో




# 'నో' సిలిండర్..


- బజ్జీల బండ్లకు, హోటళ్లకు మాత్రం 'ఎస్'!
- డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగం..
- అధికారుల నామామాత్రపు తనిఖీలు
- బ్లాక్‌లో 2వేల నుండి 2500 వరకు అమ్మకం

**వలిగొండ /అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా కనిపిస్తుండటంతో గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. గృహాలకు అవసరమైన డొమెస్టిక్ సిలిండర్లు సమయానికి అందకపోయినా,బజ్జీల బండ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,హోటళ్లకు మాత్రం సులభంగా మిగతా.. 2లో



# సింగరేణి టెండర్ "స్కామ్"

- 2.70 లక్షల గుడ్‌విల్ డీల్?
- టెండర్ వెనుక భారీ కథ
- ఒకరికి రూల్స్... మరొకరికి రిలాక్స్
- సింగరేణిలో వివక్ష ఆరోపణలు
- విజిలెన్స్ దృష్టికి ఫిర్యాదు





**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో:** సింగరేణి సంస్థలో అద్దె వాహనాల టెండర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా భూ నిర్వాసితులు, ఆదివాసీల పట్ల వివక్ష చూపిస్తూ, కొంతమంది అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివాసీ సింగరేణి ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించిన వివరాల ప్రకారం, భూ నిర్వాసితులకు ఆర్థికంగా మిగతా.. 2లో

# 116 ఎకరాల్లో 2,160 సింగిల్ బెడ్ ఇళ్లు

- రాష్ట్రానికే తలమానికంగా మోడల్ కాలనీ
- రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- పారదర్శకంగా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ
- తొలి విడతలో 1500 మంది లబ్ధిదారుల ఎంపిక
- లబ్ధిదారుల జాబితాలో అనర్హులు ఉండి ఉంటే నేరుగా ఫిర్యాదు చేయండి
- మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట సమీపంలో 116 ఎకరాల విస్తీర్ణంలో 2,160 సింగిల్ బెడ్ రూమ్ లతో నిర్మించిన మోడల్ కాలనీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం కానుందని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.2011 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించిన మోడల్ కాలనీ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం ధర చెల్లించి భూమి కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన మోడల్ కాలనీని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ స్థానిక ఆర్డిఓలతో పాటు గృహ నిర్మాణ శాఖాధికారులు ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం, తెలంగాణా రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం మోడల్ కాలనీ పనులను ఉద్దేశ్య పూర్వకంగా ఆటకెక్కించడంతోటే ఇంతటి జాప్యం కలిగిందన్నారు. అప్పటికే 90 శాతం మేర పనులు పూర్తి అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందన్న కోణంలో నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రావడంతో పనులు వేగవంతం చేశామన్నారు. మారుతున్న పరిస్థితిలకు అనుగుణంగా మోడల్ కాలనీని తీర్చిదిద్దుతున్నామని అందులో భాగంగానే భూమి కొనుగోలుకు చేసిన వ్యయం మినహాయించి మొత్తంగా ఒక్క నిర్మాణానికే రూ. 125 కోట్లు వెచ్చించడంతో పాటు మరో రూ.20 కోట్లు తాజాగా మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. అంతేగాక రూ.10 కోట్లతో ఈ మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు మరో రూ.10 కోట్లతో ఇదే కాలనీలో అంగడి వాడి కేంద్రం, కమ్యూనిటీ హాల్,క్రీడా ప్రాంగణం, వాకింగ్ ట్రాక్,ఓపెన్ జిమ్ ఏర్పట్లతో పాటు సిసి రోడ్ల నిర్మాణం,డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.ఏప్రిల్ మాసంతానికి మోడల్ కాలనీ ప్రారంభోత్సవం ఉంటుందని ఆయన సూచనా ప్రాయంగా వెల్లడించారు.ఇట్టి ప్రారంభోత్సవానికి ముందే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అందులో మొదటి విడతలో అధికారులు 1500 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆయన ప్రకటించారు. మిగతా.. 2లో

# రైతులను నట్టేట ముంచిన సర్కార్

- రైతు వ్యతిరేక ప్రభుత్వంగా ప్రజా ప్రభుత్వం
- పంటల కొనుగోలులో కాంగ్రెస్ వైఫల్యంపై బీఆర్ఎస్ ధ్వజం
- ధాన్యం క్వింటాకు రూ. 600, మొక్కజొన్నకు రూ. 900 నష్టపోతున్న రైతులు
- 40% కోతలు పూర్తయినా తెరవని కొనుగోలు కేంద్రాలు
- 1000 ఎకరాలు సాగైన ప్రతి గ్రామంలో మొక్కజొన్న కేంద్రం ఏర్పాటు చేయాలి
- హరీష్ రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, లింగాల కమల్ రాజు



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని పంటల కొనుగోలులో విఫలమై రైతులను నట్టేట ముంచుతోందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్ మిగతా.. 2లో





# 116 ఎకరాల్లో 2,160 సింగిల్ బెడ్ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి..

అదే సమయంలో లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా పూర్తి స్థాయిలో పారదర్శకంగా ఉంటుందని బహిరంగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హుజూర్ నగర్ కే ఐకాన్ గా నిలబడనున్న ఈ మోడల్ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అపోహలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని నిష్పక్షపాతంగా ఎంపిక ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సిఫార్సులు కుడా అర్హులైన వారే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనర్హులను సిఫార్సు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల జాబితాను ఒకటికి రెండు సార్లు నిశితంగా పరిశీలించాలని జాబితాలో ఒక్క అనర్హుడి పేరు ఉన్నా మోడల్ కాలనీ నిర్మాణ సంకల్పం దెబ్బ తింటుందని ఆయన అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నిజ నిజాలు తెలుసు కోకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించి అపోహలు రేకెత్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పూర్తి స్థాయిలో పారదర్శకంగా ఉంటుందని ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారం ఉండదని ఒకవేళ ఎవరికైనా అనుమానం వస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరించారు.

# 'నో' సిలిండర్..

మొదటి పేజీ తరువాయి..

అందుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిలిండర్ బుకింగ్ చేసినప్పటికీ 10 రోజులు గడిచినా సరఫరా జరగడంలేదని గృహిణిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లినా సరైన సమాధానం ఇవ్వకుండా తిప్పికొడుతున్నారని చెబుతు న్నారు. ఇదిలా ఉండగా, గ్యాస్ డీలర్లు డొమెస్టిక్ సిలిండర్లను అధిక ధరలకు బ్లాక్ లో 2000 నుండి 2500 రూపాయలు వరకు విక్రయిస్తూ, బజ్జీల బండ్లు, హోటళ్లకు సరఫరా చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్లు ఉపయోగించాల్సిన వ్యాపార సంస్థలు డొమెస్టిక్ గ్యాస్ వినియోగించడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ వినియోగ దారులకు గ్యాస్ కొరత లేదని చెబుతున్నప్పటికీ, వలిగొండ మండలంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందని ప్రజలు అంటున్నారు. డీలర్లు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ వినియోగ దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు, సంబంధిత అధికారులు కేవలం నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ ప్రజలకు సమయానికి గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# సింగరేణి టెండర్ "స్కామ్"

మొదటి పేజీ తరువాయి..

సహకరించేందుకు కేటాయించాల్సిన అద్దె వాహనాల టెండర్లలో స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేసే విషయంలో అసమానతలు ఉన్నాయని ఆరోపించారు. టెండర్ నంబర్ MN12500112 (09.01.2026) ప్రకారం కుటుంబానికి ఒక్కరే టెండర్‌లో పాల్గొనాలనే నిబంధనను కేవలం ఆదివాసీ నిర్వాసితులపైనే అమలు చేస్తున్నారని వారు తెలిపారు. అదే సమయంలో, మరో టెండర్ MN1200111 (08.01.2026)లో ఒకే కుటుంబానికి చెందిన గిరిజనేతరులకు చెందిన పలువురికి టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఒక నిర్దిష్ట కాంట్రాక్టర్‌కు అనుకూలంగా టెండర్ కేటాయించేలా అధికారుల చర్యలు ఉన్నాయని, నిబంధనలను ఉల్లంఘించి బినామీ కాంట్రాక్టర్‌కు టెండర్ కట్టబెట్టారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. అదనంగా, టెండర్ పొందిన వ్యక్తి వద్ద రూ.2.70 లక్షల వరకు గుడ్‌విల్ తీసుకున్నారన్న ఆరోపణలు కూడా వెలువడ్డాయి. ఈ అంశంపై అధికారులను ప్రశ్నించగా, వారు పరస్పర విరుద్ధ సమాధానాలు ఇస్తూ బాధ్యత తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పైగా, ఫిర్యాదు చేస్తే చేసుకోమని బెదిరింపులకు కూడా దిగారన్న విషయాన్ని సంఘం ప్రతినిధులు వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారంపై సింగరేణి సి ఎండీ , విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే పూర్తి స్థాయి విచారణ జరిపి, అక్రమంగా కేటాయించిన టెండర్లను రద్దు చేయాలని, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని సంఘం హెచ్చరించింది.

# రైతులను నట్టేట ముంచిన సర్కార్

మొదటి పేజీ తరువాయి..

బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ఖమ్మం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో పంట చేతికి రాకముందే కొనుగోలు కేంద్రాలు బస్తాలు నిధులు సిద్ధంగా ఉండేవని కానీ నేడు మార్చి 15 నాటికే కేంద్రాలు తెరవాలని ఉన్నా ఏప్రిల్ వచ్చినా కొనుగోలు ప్రక్రియ మొక్కుబడిగా సాగుతోందని సండ్ర మండిపడ్డారు. వరికి మద్దతు ధర రూ. 2,389 ఉంటే కేంద్రాలు లేక రైతులు బయట రూ. 1,800కే అమ్ముకుంటున్నారు. అంటే క్వింటాకు రూ. 600 నష్టం వాటిల్లుతోంది. మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ఉండగా రూ. 1,500 కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల రైతు క్వింటాకు రూ. 900 నష్టపోతున్నాడు. స్థానిక ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు సిండికేట్ అయ్యారని సత్తుపల్లి వంటి ప్రాంతాలకు నెల్లూరు నుండి ధాన్యం వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన రూ. 500 బోనస్ ఊసేలేదని ఇప్పటికే 40 శాతం ధాన్యం ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నాక ప్రభుత్వం ఎవరికి బోనస్ ఇస్తుందని ప్రశ్నించారు.

రైతు భరోసా రైతు బీమాను ఈ ప్రభుత్వం ఎత్తేసిందని విమర్శించారు.మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధి పేరుతో రైతుల భూములు లాక్కుంటున్నారని, దీనిని అడ్డుకోవడానికి వెళ్తున్న మాజీ మంత్రి హరీష్ రావును అక్రమంగా అరెస్టు చేయడాన్ని లింగాల కమల్ రాజు తీవ్రంగా ఖండించారు. చింతకాని మండలంలో ఒక గ్రామంలోనే 50 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుంటే ప్రభుత్వం కేవలం 22 వేల బస్తాలు మాత్రమే సరఫరా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులు రోడ్లపై పంటను ఆరబెట్టుకుని వర్షానికి తడిసిపోతుంటే జిల్లా మంత్రులు ఎందుకు సమీక్ష చేయడం లేదని ప్రశ్నించారు. పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామన్న హామీని ఐదేళ్లలో ఎప్పుడో అమలు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. 1000 ఎకరాలకు పైగా సాగైన ప్రతి గ్రామంలో తక్షణమే మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అవసరమైన గన్నీ బ్యాగులు లారీలు సిబ్బందిని వెంటనే కేటాయించాలని మద్దతు ధరతో పాటు ప్రకటించిన రూ. 500 బోనస్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగంతో కలిసి అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పిలుపు మేరకు పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య వాచేపల్లి లక్ష్మారెడ్డి కనగాల వెంకట్రావు ఉద్యమకారులు పగడాల నరేందర్ నాయకులు మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ముత్యాల వెంకటప్పారావు మంకెన రమేష్ బొడ్డు వెంకట రామారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలని, నిన్నటి నుండి ప్రారంభమైన ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాకే కాకుండా పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. ముఖ్యంగా సర్జికల్ ఆంకాలజీ విభాగంలో జరుగుతున్న శస్త్రచికిత్సలు, శిశు మరణాల రేటును తగ్గించేందుకు చేపట్టిన 'సంకల్ప' ప్రోగ్రామ్ ద్వారా రిమ్స్ కు జాతీయ స్థాయి గుర్తింపు, టీబీ నివారణలో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతికి గాను అవార్డులు రావడం అభినంద నీయమన్నారు. పాఠశాల స్థాయి నుండే పిల్లలు గుట్కా, పాన్ మసాలా, మద్యం, గంజాయి వంటి అలవాట్లకు లోనవుతుండటం ఆందోళనకరమని, ఇటువంటి వారిని గుర్తించి రిమ్స్ లేదా స్వచ్ఛంద సంస్థలు నడిపే డి-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అలాగే గర్భిణీ స్త్రీలలో రక్తహీనత (అనిమియా) సమస్య తీవ్రంగా ఉందని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను సక్రమంగా వాడేలా చూడాలన్నారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరమైన యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తాగడం, 6 నుండి 7 గంటల నిద్ర, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ యోగా, వ్యాయామం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. ఆదిలాబాదు పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ మానవ జీవితం చాలా స్వల్పమైనదని, డబ్ల్యూహెచ్ఓ నివేదికల ప్రకారం సగటు జీవితకాలం 60 నుండి 70 ఏళ్లకు తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.





ప్రతి ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇది కేవలం సంబరాల కోసం కాకుండా మన ఆరోగ్యంపై మనకు అవగాహన కలిగించే 'అలారం' వంటిదని పేర్కొన్నారు. నేటి సమాజంలో 30-40 ఏళ్లకే అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగితే ప్రభుత్వం వైద్యం కోసం చేసే భారీ ఖర్చు తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్యులను ఎంత గానో నమ్ముతారని, వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలోని ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకు పరిమితం కాకుండా హై డోస్ మందులు, పెయిన్ కిల్లర్లు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం సంభవిస్తోందని హెచ్చరించారు. గతంలో బజార్ హత్నూర్, గాదిగూడ వంటి మండలాల్లో కిడ్నీ సమస్యలతో పలువురు మృతి చెందడానికి విదేశాల నుండి వచ్చిన అనర్హులైన వ్యక్తులు చేసే వైద్యమే కారణమని గుర్తు చేశారు. యువత గంజాయి, గుట్కా, సిగరెట్లు వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని, దీనిపై కఠిన నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మనిషి ఏ రంగంలో ఉన్నా విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి నుండి బయటపడాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా మనం తీసుకునే ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, నడక వంటి అంశాలను సమన్వయం చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. యోగాను అలవరచుకోవడం ద్వారా సుమారు 50 నుండి 60 శాతం వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టిబి నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి, ఆయుష్ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. తదుపరి ఉత్తమ వైద్య సేవలు అందించిన పలువురు వైద్యులకు, సిబ్బందికి, నిక్షయ మిత్రాలకు కలెక్టర్, ఎంపీ ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం నూతన టిబి ఎక్స్ రే యంత్రాన్ని కలెక్టర్, ఎంపీ ఆవిష్కరించి, టిబి వ్యాధిగ్రస్తులకు నిక్షయ పోషణ్ కిట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లీగల్ అడ్వైజర్ దాసరి గంగారం, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
బుధవారం। 08, ఏప్రిల్ 2026




# ఆరోగ్యమే మహాభాగ్యం

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ కళాశాల వద్ద నుండి ఎంజీఎం కూడలి వరకు “ఆరోగ్యమే మహా భాగ్యం” అంశంపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఎంజీఎం కూడలి మీదుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ వరకు కొనసాగింది. ఎంజీఎం కూడలి వద్ద “మనవహారం” కార్యక్రమం




నిర్వహించి, ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని ప్రజలకు, బాటసారులకు వివరించారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ, “ఆరోగ్యం కోసం కలిసికట్టుగా – విజ్ఞాన శాస్త్రానికి అండగా నిలబడదాం” అని పిలుపునిచ్చారు.

ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని, ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వైవి గణేష్, సంధ్యారాణి, జెడ్పి సిఈఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, వైద్యులు, ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే పిల్లల భవిష్యత్‌కు బాట

## - ఉపసర్పంచ్ మోటె రమేష్

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రంలోని సంజీవయ్య నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ‘ముందస్తు బడిబాట’ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిధిలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మోటె రమేష్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బాలబాలికను తప్పనిసరిగా ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మనందరి బాధ్యత అని అన్నారు. వార్డు సభ్యుడు కొమ్ము రామస్వామి




మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పౌష్టికాహారం, ఉచిత యూనిఫారం, నోటుపుస్తకాలు, రాగి జావా వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను వినియోగించుకుని ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు జలజాక్షి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్య, క్రమశిక్షణతో బోధన కొనసాగుతున్నందున పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు పుష్పావతి, నాగయ్య, అబ్దుల్ రహీం, కుమారస్వామి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య

## సిపిఎం పోరుయాత్ర సందర్భంగా పలు సమస్యల పరిశీలన

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:**

శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరు యాత్రలో భాగంగా శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామంలో స్థానిక సిపిఎం నాయకులతో కలిసి సమస్యలు పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా శోభనాద్రిపురం గ్రామంలో వడ్డెవాగుపై వంతెన నిర్మాణం చేయకపోవడంతో వందలాది మంది రైతులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. స్మశాన వాటికకు ప్రధాన రహదారి కావడంతో చావుల సమయంలో మోకాళ్ళ లోతు నీళ్ల నుండి నడుచుకుంటూ పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. నీర్నేముల గ్రామంలో మంచినీటి ఓఎచ్ఆర్ ట్యాంకు నిచ్చెన శిథిలావస్థకు చేరినది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పట్టించుకోవడంలేదని గ్రామానికి అంతటికి ప్రధాన నీటి వనరు అయిన ట్యాంకును కడిగే పరిస్థితి లేదని అన్నారు. దాని మూలంగా ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పలుమార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి రైతులకు నష్టం జరగకుండా





చూడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్, మండల కమిటీ సభ్యులు ఎండీ రషీద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, శాఖ కార్యదర్శిలు గోగు లింగస్వామి, నాగటి లక్ష్మణ్, మేడి ముకుంద, కొమ్ము అంజయ్య, ఎండీ లతీఫ్, నాగటి అంజయ్య, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, వడ్లకొండ రమేష్, బోడిగే వెంకటేష్, నరేష్, బోయిని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

## శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహామండలిచైర్మన్ ,ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కు గౌరవ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్. కార్మిక రంగంలో జనక్ ప్రసాద్ చేసిన సేవలకు గుర్తింపుగా న్యూఢిల్లీలో జిహెచ్ఆర్టిఇండియా, వెబ్బిక్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని డాక్టరేట్ పట్టాను జనక్ ప్రసాద్‌కు అందజేశారు.






క్రాంతి కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మిక రంగంలో ట్రేడ్ యూనియన్ నాయకుడిగా, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యుడిగా, కార్మికుల హక్కుల పరిరక్షణకు , సంక్షేమానికి విశేష కృషి చేస్తూ , కార్మికుల సమస్యలు , జీతభత్యాలు , సంక్షేమ పథకాలు , కార్మిక చట్టాలపై అపారమైన అనుభవం కలిగిన జనక్ ప్రసాద్ కు డాక్టరేట్ గౌరవం లభించడం ఐఎన్టీయూఎస్ తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గాని కార్మికులందరికీ గర్వించదగిన విషయమని తెలుపుతూ సత్తుపల్లి ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు డి.ఎల్.ఆర్ కార్మికులందరూ హర్షం వ్యక్తం చేశారు.

# నిత్యవసరాల ధరలు తగ్గించాలి

## - సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ

**యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్:**

పేదల నిత్యావసరల ధరలు తగ్గించాలని 9వ వార్డు ఇంద్రమ్మ కాలనీలో సింగన్నగూడెం వద్దా నిరసన లో పాల్గొని సిపిఐఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యవసర ధరలు పెరుగుతూ పేదల ప్రజలు రోజు పనికి పోయే కార్మికుల పై ధరలు ఇష్టం వచ్చినట్లు పెంచుతూ పేద ప్రజల రక్తాన్ని పిలుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేషన్ శక్తులకే మద్దతు తెలుపుతూ సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు పప్పులు నూనెలు సబ్బులు జిఎస్టి తగ్గిస్తున్నానని చెప్తూ గొప్పలు చెప్తున్నా నరేంద్ర మోడీ ఈ పేదవాళ్ల తినుబండారాలు పెరుగుతుంటే కనిపించడం లేదా ధరలను అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి యుద్ధం పేరుతో గ్యాస్ ఇతర దేశాల నుండి రాకపోవడం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అసమర్ధత పాలనగా చేస్తున్నది సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున గ్యాస్ పెట్రోలు డీజిల్ నిలువలు చాలా ఉన్నాయని గొప్పలు చెప్తున్న నరేంద్ర మోడీ పెద్ద పెద్ద పట్టణాల్లో గ్యాస్ లేక ఆటోలు క్యాబ్ కార్లు డ్రైవర్లు రెండు మూడు రోజులు లైన్ లో ఉండి అది 400 వందలు 500 వందల గ్యాస్ ఇవ్వడం తప్ప గ్యాస్ కొరత ఉన్నదని సరిగ్గా ఇవ్వడం లేదు ఆటో వారు క్యాబ్ వారు పనులు లేక పస్తులు ఉండే పరిస్థితి అప్పులు ఈ ఎం ఐ లు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుంది అందుకే దేశ




ప్రధాని మోడీ మౌనం వీడి యుద్ధాన్ని ఆపాలని మంచి స్నేహితుడు డోనాల్డ్ ట్రంప్‌కు చెప్పుకునే మోడీ గారు యుద్ధాన్ని ఆపాలని తెలుపాలని లేనిపక్షంలో భారతదేశం ఉన్న ప్రజలపై అనేక భారాలు పడుతున్నవి ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య పట్టణ నాయకులు కొలుపుల కృష్ణ, చింతల శివ, కుచ్చుల నరసింహా, నోముల లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.





# చలివేంద్రం ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహబూబ్ నగర్ నగరంలోని మార్కెట్ ప్రాంతంలో 55వ డివిజన్ కార్పొరేటర్ అనురాధ చిన్న ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ఉండేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మార్కెట్ ప్రాంతాలకు రోజూ భారీ సంఖ్యలో వచ్చే వ్యాపారులు, కూలీలు, వినియోగదారులు తీవ్రమైన ఎండల కారణంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కార్పొరేటర్ అనురాధ చిన్న ని ప్రశంసించారు. అనంతరం, నిర్మాణంలో ఉన్న వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారుతో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, వర్షాకాలంలో వర్షపు నీరు మార్కెట్ లోపలికి చేరకుండా సమగ్ర డ్రైనేజ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే, వ్యాపారస్తులకు ఉపయోగపడే విధంగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతను కాపాడుతూ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదారుకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈసందర్భంగా వీధి వ్యాపారులతో ముచ్చటించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పండ్ల వ్యాపారులను ప్రోత్సహిస్తూ స్వయంగా పండ్లు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, స్థానిక నాయకులు వర్థ రవి, రఘు దాసరి, గోపి నాయక్, మార్కెట్ వ్యాపారులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారమైంది

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:**
పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాకారం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బధ్యతండా గ్రామంలో బానోతు సైదమ్మ కృష్ణల నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత పాలకులు 10 ఏళ్లలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని,కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారందరికి మంజూరు చేసినట్లు తెలిపారు.మొదటి విడతలో మండల వ్యాప్తంగా 545 ఇళ్లు మంజూరు



కాగా ఇప్పటి అన్ని పూర్తి కావస్తున్నాయని చెప్పారు.మొదటి విడతలో ఇళ్లు రాని వారు బాధ పడవద్దని వారికి రెండవ విడతలో అర్హులైన వారందరికి ఇళ్లు వస్తాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.రెండవ విడతలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్,డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్యల సహకారశీతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు,గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారవత్ కనకమ్మ సోమాని నాయక్,బానోతు వెంకన్న నాయక్,మాజీ సర్పంచ్ పద్మ మంగ్తియా,నాయకులు బానోతు రాజా, చంప్లా, నాగేశ్వర్ రావు,శ్రీను నాయక్,దేవ్ల నాయక్,లాలూ నాయక్,సైదా నాయక్,వీరన్న నాయక్,నాగు నాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడి వద్దకే వెళ్లి ఫిర్యాదు నమోదు

## సత్వర న్యాయం అందించేందుకు పోలీసుల వినూత్న ప్రయోగం

**వలిగొండ /అక్షిత న్యూస్:**
ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేయడం పోలీస్ శాఖ బాధ్యత అని మరోసారి నిరూపితమైంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసిన ఘటన వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది మంగళవారం రోజున ఉదయం11:00 గంటల సమయంలో మండలంలోని ఎం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఉడుత నరసింహ అనే వ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన మర్రి చంద్రయ్య అనే వ్యక్తి కర్ర తో కొట్టగా, గాయపడిన అతను స్థానిక రేణుకా దేవి హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా హాస్పిటల్ వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా అతను పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వలేని పరిస్థితిలో ఉండగా వెంటనే వలిగొండ ఎస్.ఐ. యుగేందర్ ఆదేశాల మేరకు, ఏఎస్ఐ జాఫర్, టెక్ టీమ్ కానిస్టేబుల్స్ అనిల్, శంకర్, మహిళ కానిస్టేబుల్ సింధు తో పాటు సంఘటన స్థలానికి స్వయంగా వెళ్లి బాధితుడిని పరామర్శించి, అతని నుండి ఫిర్యాదును స్వీకరించారు.బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్-సైట్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి, కేసును బి ఎం ఎస్ చట్టం ప్రకారం నమోదు చేశారు.

పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నా కూడా ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులు స్వయంగా




ప్రజల వద్దకే వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు. ఈ సంఘటన పోలీసులు ప్రజలకు ఎంత దగ్గరగా ఉన్నారో, ప్రజల సమస్యలను ఎంత బాధ్యతగా తీసుకుంటారో చూపించే మంచి ఉదాహరణగా నిలిచింది.




## బట్టీ కార్మికుల చెమట చుక్కకు

# న్యాయ సేవ ఆరోగ్య రక్ష..

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వెలిచాలలోని ఇటుక బట్టీల వద్ద ఉచిత వైద్య శిబిరంతో పాటు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కే. ప్రసాద్, లేబర్ ఆఫీసర్ మొహమ్మద్ రఫీ మరియు వెలిచాల గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగ రావు, న్యాయవాది బండపల్లి శ్రీధర్‌లు ప్రారంభించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో ఉండి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన ఇటుక బట్టీ కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల వ్యాధి నిపుణులు, శిశువైద్యులు, కంటి వైద్యులు మరియు మానసిక వైద్య నిపుణులు వందలాది మంది కార్మికులకు క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహిం చారు. ఆరోగ్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా కార్మికుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి సైకాలజిస్టుల ద్వారా ప్రత్యేక కౌన్సెలింగ్ అందించారు. వైద్య పరీక్షలతో పాటు కార్మి కులకు ఉండాల్సిన చట్టపరమైన హక్కులు, కనీస వేతనాలు మరియు భద్రతా నియమాలపై న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. ఏదైనా కష్టం వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు భరత్ రాజ్, హారిక,వినీత్,మాధురి, మొహమ్మద్ హారీస్, ఫార్మసీ ఆఫీసర్ ప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్ లు శ్రావణ్ కుమార్, ఉదయ్ కిరణ్, వెలిచాల మెడికల్ ఆఫీసర్ అశ్విత మరియు సిబిఆర్ ఇటుక బట్టీ యజమాని చిన్నకేశవులు, ఇటుక బట్టీ యజమానులు నారాయణ రావు, సురేందర్, అక్బర్, నవీన్ కార్మికులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**
కరీంనగర్ లో మంగళవారం పలు 10వ తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు.



తిరుమల్ నగర్ లోని తెలంగాణ మైనారిటీ బాలికల స్కూలు 2 , కోతి రాంపూర్‌లోని సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విద్యార్థుల హాజరు అంశాలపై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
బుధవారం। 08, ఏప్రిల్ 2026



## ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ నగరంలోని మెప్మా కార్యాలయంలో మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ సెంటర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అత్యవసరమని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే, భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందాలంటే సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలని, ఉచిత శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. శిక్షణ కేంద్రంలో అందిస్తున్న కోర్సులు, శిక్షణ విధానం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రఘు దాసరి, సతీష్ కుమార్, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానకొండూర్ రోడ్లకు మహర్దశ

### రహదారుల దుస్థితిపై కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి పరిశీలన

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** మానకొండూరు మండల కేంద్రం నుంచి శ్రీనివాస్ నగర్ మీదుగా జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారిందని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉద్దేశంతో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఈ మార్గంలో పర్యటించి రోడ్ల దుస్థితిని పరిశీలించారు. మార్గమధ్యంలో దెబ్బతిన్న రోడ్లను, ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, వంతెనలను వారు పరిశీలించారు.

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినప్పుడు సానుకూలంగా స్పందిస్తూ రోడ్ల



పరిశీలనకు వచ్చారన్నారు. రోడ్ల దుస్థితిని ప్రత్యక్షంగా చూడటం వల్ల జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమస్య తీవ్రతను గుర్తించి సమస్య నివారణకు సానుకూలత వ్యక్తం చేశారన్నారు. ఫలితంగా త్వరలోనే ఈ మార్గంలో కొత్త రోడ్లు వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. దీంతో ఈ రోడ్లకు మహర్దశ పట్టే యోగం ఉందన్నారు. త్వరలోనే కొత్త రోడ్డు వేసేందుకు ప్రభుత్వపరంగా అనుమతి లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, మానకొండూర్ తహశీల్దార్ విజయ్ కుమార్, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మడుపు ప్రేమ్ కుమార్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, పెంచాల కిషన్ రెడ్డి, బుర్ర శ్రీకాంత్, గుజ్జ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులు కష్టపడి చదవాలి

### - కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:**

విద్యార్థులు వారి మంచి భవిష్యత్తు, ఉన్నతమైన వృత్తి సాధన కోసం కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.

హన్వాడ మండల కేంద్రంలోని హన్వాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి. సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను, వేపూర్ మహాత్మా జ్యోతి బా పూలే తెలంగాణ బి.సి సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు.తొలుత హాన్వాడ మహాత్మా జ్యోతి బా పూలే బి. సి.సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు.

పాఠశాలలోని వంటగదిని తనిఖీ చేసి కలెక్టర్ భోజనం నాణ్యతను పరిశీలించారు. వంటగది శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని, భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను, డార్మిటరీనీ, తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యంగా వేసవి కాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం హన్వాడ మండలంలోని పల్లెమోని కాలనీ సమీపంలో ఉన్న వేపూర్ బి. సి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. అక్కడ 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ, ఈ రోజు వ్రాసిన ఎస్.ఎస్. సి బయాలజీ పరీక్ష పేపర్ ఎలా వచ్చింది, పరీక్షా ఎలా రాశారు? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఎస్. సి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన తొలి మైలురాయి అని, అందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. పరీక్షలను భయం లేకుండా ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి కూడా కలెక్టర్ వివరాలు



అడిగి తెలుసుకున్నారు. హీమోగ్లోబిన్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారా అని అడిగారు. మంచి ఆరోగ్యానికి ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, అవి ఐరన్, కాల్షియం, ప్రోటీన్లను అందిస్తాయని తెలిపారు.

పాఠశాలలోని డార్మిటరీని పరిశీలించి వేసవిలో ఇబ్బంది లేకుండా ఫ్యాన్ లు అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదినీ, స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, గుడ్ల నిల్వలను కూడా తనిఖీ చేశారు.బోజన నాణ్యత పరిశీలించి తదనంతరం కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా
## సైక్లింగ్ ర్యాలీలో “అల్ఫోర్స్” నరేందర్ రెడ్డి

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నిస్తారని మరియు అహర్నిశలు కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు “అల్ఫోర్స్” డా.వి. నరేందర్ రెడ్డి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తో కలిసి ఏర్పాటు చేసినటువంటి హెల్తీ సైకిల్ ర్యాలీ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని మరియు ఆహారపు అలవాట్లు సైతం మార్చుకోవడం జరుగుతుందని వారు చెప్పారు. వ్యక్తిగతంగా లాభాలు చేకూరడమే కాకుండా సమాజపరంగా చాలా లాభాలు చేకూరుతాయని వారు తెలియపర్చారు. ప్రధానంగా పర్యావరణాన్ని కాలుష్యం నుండి సంరక్షించవచ్చని మరియు చక్కటి వాతావరణన్ని ఏర్పాటు చేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు.

అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఇస్తారని కావున ప్రతి ఒక్కరు సైక్లింగ్ అలవాటుగా చేసుకుని సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారు పిలుపునిచ్చారు. సైక్లింగ్ చేయడం వలన చాలా ఆరోగ్యంగా ఉండగలుగుతారని మరియు రోజువారీ కార్యకలాపాలను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వర్తించడమే కాకుండా అందులో విజయం సాధించగలుగుతారని అభిప్రాయపడ్డారు. అగ్రదేశాలైన రష్యా, చైనా, జర్మనీ, కెనడా, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఉన్నదని కావున సైక్లింగ్ ఉన్నటువంటి లాభాలను తెలుసుకొని దానిని రోజువారి కార్యక్రమంలో మల్చుకొని సైక్లింగ్ పట్ల శ్రద్ధ వహించాలని వారు చెప్పారు.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తన సారధ్యంలో కరీంనగర్ జిల్లా



సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మరియు నిర్వహణలో భాగంగా మంగళవారం ర్యాలిని నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు స్ఫూర్తిదాయకమని వారు చెప్పారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి , కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి మహేందర్ , ట్రాఫిక్ సిఐ బి.సంజీవ్ ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ బాధ్యులు ఎం.అరవింద్ , రమేష్ , జిల్లా పోలీస్ కమిషనరేట్ సిబ్బంది, రేని గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిబ్బంది, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల వారి సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలియపరిచారు.

ఈ ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి బస్టాండ్ మీదుగా, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా మరియు రెనీ హాస్పిటల్ వారికి కొనసాగింది దాదాపు వందకు పైగా సైకిలిస్టులు పాల్గొన్నారు.పాల్గొన్న వారందరికీ త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని వారు చెప్పారు.

## మారుమూల ప్రాంతాలలో సైతం
# మెరుగైన ఆరోగ్య వైద్య సేవలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, అక్షిత న్యూస్:** జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోధ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సంక్షేమం కోసం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలో చేపట్టిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సెప్టెంబర్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు హెచ్ పి వి టీకా అందించడం జరుగుతుందని, నవజాత శిశువు నుండి పిల్లలకు సకాలంలో టీకాలు అందించి వారి ఆరోగ్యం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సరైన పోషక ఆహారాలు అందించి పిల్లల ఎదుగుదలకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించి వారి ఆరోగ్య దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుందని తెలిపారు. వైద్యవృత్తి సవాళ్లతో కూడుకుందని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. వైద్య రంగంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్లను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందించేందుకు తగిన పరికరాలు, సిబ్బంది సమకూర్చడం జరిగిందని తెలిపారు.





ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది గ్రామస్థాయిలో సేవలు అందించాలని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని, గిరిజన గ్రామాలలో వైద్య సేవలను అందుబాటులో ఉంచే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, పిల్లలు, ప్రజలు సకాలంలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇప్ప పువ్వు లడ్డు, అంతర పంటలను సాగు చేసి పోషక విలువలు కలిగిన పంట ఉత్పత్తులను అందుబాటులో ఉంచేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేసి సేవలు అందించడం జరుగుతుందని, కుటుంబ నియంత్రణపై మారుమూల ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణులు నియమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల,అక్షిత న్యూస్:** గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఉండవెల్లిలోని ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగది, భోజనశాల, నిల్వ గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వంట గదిలో ఎల్లప్పుడూ శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యానికి అనుకూలమైన వాతావరణం ఉండేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టోర్ రూమ్ లో అవసరమైన సరుకులు తగిన మోతాదులో నిల్వ ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని ఆదేశించారు. తరువాత విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ భోజనం, క్రీడా సమయం, తరగతులు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై వివరాలు తెలుసుకోగా, విద్యార్థినులు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థినులు బాగా చదివి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన మార్గదర్శనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మరుగుదొడ్లు రోజుకు కనీసం రెండు సార్లు శుభ్రం చేయాలని, పాత వస్తువులను తొలగించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు., అనుమతి లేని వ్యక్తులను పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ధరణీషా, ఎంపీడీఓ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు, తదితరులున్నారు.

## ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన కలెక్టర్,ఎమ్మెల్యే

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అల్గునూరు, నల్లగొండ గ్రామాల్లోగల ప్రభుత్వ స్థలాలను మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అల్గునూరు గ్రామంలో 4 ఎకరాలు, నల్లగొండలో 2-10 ఎకరాల ప్రభుత్వ స్థలలాను పరిశీలించారు. నివేశన స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించడమే కాకుండా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ సొంతికలను సాకారం చేయాలనే సంకల్పంతో ఈ స్థలాల పరిశీలన చేశారు. ఈ గ్రామాల్లో అనువైన ప్రదేశాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇచ్చేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని



ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరగా, అసైన్ మెంట్ కమిటీ ఆమోదం మేరకు సత్వర చర్యలు తీసుకుంటామని, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి అనుమతులు పొందేలా చూస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు ఎ.రమేశ్ యాదవ్, గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి,చిందం కిష్టయ్య, పి.శ్రీకాంత్, నాగేందర్, తాళ్లపల్లి శ్రీనివాస్ రావు, నల్లగొండ సర్పంచ్ మారుతితోపాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు

## నిరుద్యోగులు వృత్తి నైపుణ్య శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** స్వయం ఉపాధి అభివృద్ధి కోసం చిన్నకాల కోర్సులు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. నిర్మల్ పట్టణంలోని రాంనగర్ పి హెచ్ సి లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వృత్తి రీత్యా కోర్సుల్లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కోర్సులు నిరుద్యోగులను త్వరగా ఉపాధి లేదా వ్యాపార రంగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు సైతం యువతకు ఉపాధి పొందెందుకు బడ్జెట్లలో నిధులను ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందని వివరించారు.



నిరుద్యోగులు, ఎవత ఇలాంటి అవకాశాలను వదులుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫెరోజ్, యస్. పిరాజు, రాఘవేంద్ర చారి,విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్ పిఎఫ్) ఆధ్వర్యంలో 5 కె రన్

**నాగార్జునసాగర్, అక్షిత ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యవరణలో భాగంగా మంగళవారం నాగార్జునసాగర్లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహించారు. ఎస్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వి. భాస్కరరావు ఆధ్వర్యంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, ప్రతాప్ నాయుడులతో కలిసి ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డిఐజి ఆర్ మాధవరావు ఆదేశాల మేరకు నిర్వహించిన 5 కె రన్ కార్యక్రమాన్ని జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుండి 420 గ్యాలరీ ముఖ ద్వారం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 ప్లాన్లో భాగంగా వారంలో ప్రతి మంగళవారం ఏదో ఒక కార్యక్రమాన్ని



నిర్వహించనున్నట్లుగా తెలిపారు. దీనిలో భాగంగానే స్వచ్ భారత్, రక్త దాన శిబిరం, అనాథ పిల్లలకు, పేదవారికి దుస్తులు, ఆహార పదార్థాల అందజేత లాంటి కార్యక్రమాలు నిర్వహించి ఎస్ పి ఎఫ్ విభాగాన్ని ఉన్నత స్థాయిలో నిలిచే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామ న్నారు. అంతేకాక సాగర్ ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ లోని జెన్కో ఎస్ పి ఎఫ్ విభాగం, సాగర్ ప్రాజెక్ట్ భద్రత విభాగం, మిర్యాలగూడకు చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరెన్సీ చెస్ట్ విభాగాలకు చెందిన 33 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY
బుధవారం, 08, ఏప్రిల్, 2026



# ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ, లక్ష్మి కిరణ్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ఈవియం గోదాం వద్ద నిరంతతరం అప్రమత్తంగా ఉంటు విధులు నిర్వహిశీచాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ, లక్ష్మి కిరణ్ పోలీస్ గార్డ్‌లను ఆదేశించారు. జిల్లా కేంద్రశీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను మంగళవారం అదరపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , బిజెపి పార్టీ ప్రతినిధి నాశీపల్లి శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిది బర్కత్ ఆలీ, టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి రవీందర్, సి పి ఐ యం పార్టీ ప్రతినిధి నరేష్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

### పల్లా కిరణ్ తల్లి వర్ధంతిని పురస్కరించుకొని

# అనాధ విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేత

### -మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**

ఖమ్మం నగరంలో ఎస్పీ ఆఫీస్ రోడ్డు నందు పల్లా కిరణ్ అమ్మ పల్లా సుశీల 2వ వర్ధంతిని పురస్కరించుకొని సెయింట్ మేరీస్ అనాథ బాలికల హాస్టల్ లో నివసిస్తున్న సుమారు 100 మంది తల్లిదండ్రులు





లేని నిరుపేద అనాథ బాలికలకు అండగా నిలబడి బాలికలకు పరీక్షల సమయంలో ఇబ్బంది కలగకుండా పరీక్ష ప్యాడ్లు బ్లూ పెన్స్ బ్లాక్ పెన్స్ రెడ్ పెన్స్ పెన్సిల్స్ జామెట్రీ కం బాక్స్ స్కేల్స్ ఎరేజర్స్ షార్నర్స్ పౌచులు స్వీట్స్ తదితర వస్తువులు అందజేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్.

ఈ కార్యక్రమంలో పల్లా కిరణ్ సైన్యం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ ప్రైవేటు టీచర్స్ పేదలకు బియ్యం నిత్యవసర సరుకులు పంపిణీ వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం నీరు నిత్యవసర సరుకులు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం వృద్ధులకు వికలాంగులకు మహిళలకు అనాథ బాలబాలికలకు యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ ఆస్తుల జోలికొస్తే ఊరుకోం

### టిఎస్ ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:**

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేటీకరణ విధానాల వల్ల కార్మికులు చెమటోడ్చి నిర్మించుకున్న,సంపాదించుకున్న ఆర్టీసి ఆస్తులను ప్రభుత్వాలు ఏక పక్షంగా ఆక్రమించు కోవాలని చూస్తున్నాయని,ఆర్టీసీ ఆస్తుల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అందుకోసం "ఆర్టీసీ రక్షణ -కార్మికుల హక్కుల పరిరక్షణకై " మరో పోరాటం తప్పదని టిఎస్ ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ ప్రభుత్వాలను హెచ్చరించారు.ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాలని,బస్ భవన్ ఏ బ్లాక్ పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని పలు డిమాండ్లు చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని బస్ డిపో ముందు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్టీసీ యొక్క ఆస్తులను వశ పరచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని,దీనిలో భాగంగానే బస్ భవన్ లోని ఏ బ్లాక్ ను ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గం అన్నారు. ఉమ్మడి ఆస్తులపై చేసిన నిర్ణయాలను తుంగలో తొక్కుతూ ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరించడం అనైతికం అన్నారు.కార్మికులు చెమటోడ్చి నిర్మించుకున్న ఆర్టీసీ ఆస్తులపై ప్రభుత్వం కన్ను పడిందని ఆరోపించారు.కార్మికులు అనేక కష్టనష్టాలను ఓర్చుకొని ప్రజలకు సేవలు అందిస్తున్నారని



ప్రభుత్వాలు మాత్రం కార్మికుల పట్ల చిత్తశుద్ధి కనబరుచక పోవడం విస్మయానికి గురి చేస్తోందని అన్నారు.విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి నడిపించాలని,కార్మికుల రే కేటగిరజేషన్ పేరా యాజమాన్యం ఒత్తిడి తెచ్చి ఆర్థిక పరమైన ఇబ్బందులు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.గత 10 ఏళ్లుగా ఒక్క పైసా వేతనం కూడా పెరగలేదని,2021,2025 వేతన సవరణలు ప్రభుత్వం గాలికి వదిలేసిశీదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజా రవాణా ఆర్టీసీ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు యల్లయ్య,వెంకన్న,కేవి రావు, మల్లయ్య, భాస్కర్, యాకమ్మ, చైతన్య,అలివేలు,సరిత,ధనలక్ష్మి, రాజేశ్వరి,కౌసల్య,కవిత, కీర్తి,శృతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్ గౌడ్‌కి అవార్డు, సత్కారం

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిన్న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విశిష్ట సేవలు అందించినందుకు డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పెనుబల్లి డా. ఎన్ కిరణ్ కుమార్ డా.బి.శివరామకృష్ణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కల్లూరు డా. రామ్ శరణ్‌లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహా వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చౌంతు టీవీవీపీ కమీషనర్ డా. అజయ్ కుమార్‌ల చేతులమీదుగా అవార్డుతోపాటు సత్కారం పొందారు.




## హత్య కేసులో నిందితుడు పరారీ..

# మళ్లీ అదుపులోకి తీసుకొన్న పోలీసులు

### నిందితుడిని ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ నితిక పంత్

### నిందితున్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రెబ్బెన పోలీసులు

### తప్పుచేసి తప్పించుకోలేరని హెచ్చరించిన ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** తిర్యాణి మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హన్మంతరావ్ ను హత్య చేసిన రాయిసిడం వినోద్ కుమార్ ను మంగళవారం ఉదయం గోలేటి ఎక్స్ రోడ్ ఆటో స్టాండ్ దగ్గర అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు రెబ్బెనా సర్కిల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. హన్మంతరావ్ మంత్రాలు చేస్తున్నాడని అనుమానంతో వినోద్ మరియు అతని కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని భావించిన నేపథ్యంలో, ఈ విషయమై గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి ఇరువర్గాలకు శాంతి పాటించాలని సూచించినప్పటికీ వివాదం కొనసాగిందన్నారు.

ఈ నేపథ్యంలో తేదీ 01.11.2025 న పొలంలో పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న హన్మంతరావ్‌పై వినోద్ తన ఇంటి ముందు గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో హన్మంతరావ్ మెడపై తీవ్రమైన గాయాలు ఉండగా, చెవి కూడా తెగిపోయినట్లు గుర్తించబడిందన్నారు. సంఘటన సమయంలో అక్కడే ఉన్న హన్మంతరావ్ భార్య బోజ్జు బాయిని కూడా హత్య చేస్తానని నిందితుడు బెదిరించగా, ఆమె భయంతో అక్కడి నుంచి తప్పించుకున్నట్లు పేర్కొన్నారు.

హత్య అనంతరం హనుమంతరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేయగా,



పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో మూత్ర విసర్జన నిమిత్తం బయటకు వెళ్తానని చెప్పి విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని తోసివేసి నిందితుడు పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నిందితుడు పరారీలో ఉండటంతో, జిల్లా ఎస్పీ నితికా పంత్, నిందితున్ని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కఠిన నిఘా కొనసాగించిన నేపథ్యంలో 07.04.2026 న నిందితుడు వినోద్‌ను మళ్లీ అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విచారణ జరిపి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనునట్లు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన రెబ్బెన సీఐ సంజయ్, రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ, తిర్యాణి ఎస్సై వెంకటేష్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, విద్యాసాగర్, శ్రీనివాస్, దుర్గేంద్ర, సందీప్‌లను జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు.

# ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల /అక్షిత బ్యూరో:** ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్.ఎం.ఓ.లు భీష్మ, శ్రీధర్, ప్రోగ్రామ్ అధికారులు డా. ప్రసాద్, డా. సుధాకర్ నాయక్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుజాత లతో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒకరికి మెరుగైన వైద్య సేవలు అందించడం కొరకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 25 ఆరోగ్య కేంద్రాలు, 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయల పరిమితికి పెంచి ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది నియామకం చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బెల్లంపల్లి, లక్షెట్టిపేట ప్రాంతాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, జిల్లాలోని భీమారం, కన్నేపల్లి మండల కేంద్రాలలో ప్రజల సౌకర్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్

పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్స్ రే, ఫోటోథెరపి సేవలు అందిస్తున్నామని, నర్సింగ్ కళాశాల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యం కోసం ఐక్యంగా విజ్ఞాన శాస్త్రం అండతో సమగ్ర ఆరోగ్యాన్ని భవిష్యత్తు కోసం తయారు చేసుకోవాలని, 72 రకాల రక్త పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా అందించడం జరుగుతోందని తెలిపారు. జాతీయ క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా కేసులను గుర్తించడము, మొబైల్ ఎక్స్రే ద్వారా మారుమూల గ్రామాలలో పరీక్షలు చేయడం, జాతీయ కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణలో 100 శాతం గర్భవతుల నమోదు, ఆసుపత్రులలో ప్రసవాలు, సిజేరియన్లు లేకుండా సాధారణ ప్రసవాలపైన ప్రజలలో అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. 100 శాతం టీకాలు ఇప్పించడం, అసంక్రమణ వ్యాధులు 30 సంవత్సరముల పైబడిన వారందరికీ పరీక్షలు చేయడం, డయాబెటిస్, బిపి, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి సరైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. 14 సంవత్సరాల వయసు నిండిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ అందించడం జరుగుతుందని, హోమియోపతి, ఆయుర్వేదం లాంటి ఆయుష్ ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, నర్సింగ్ అధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వైద్యాధికారులు డా. అమర్, డా. రమ్య, వైద్య సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.



## వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు
# పకడ్బందీ ప్రణాళిక

**- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను వేగవంతం చేయాలి**

**మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పకడ్బంది ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు. మంగళవారం బాలాజీ గ్రాండ్ బ్యాకేట్ హాల్ లో మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్,మున్సిపల్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంలో ఈ వేసవి కాలంలో త్రాగునీటి సమస్య రాకుండా ఆర్డబ్ల్యూఎస్,పబ్లిక్ హెల్త్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ విలీన గ్రామాల్లోని ఆయా వార్డుల్లో ముందస్తుగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని చెప్పారు. గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న వార్డులలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని,అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఇలు క్షేత్ర స్థాయిలో తిరిగి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనీ తవ్విన గోతులను వెంటనే పూడ్చి, రోడ్లను యథాస్థితికి తీసుకు రావాలని సూచించారు. ఇట్టి పనులపై ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి, మిషన్ భగీరథ,పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో
# ప్రభుత్వ హాస్పిటల్‌లో పండ్లు బ్రెడ్ పంపిణీ



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గల ప్రభుత్వ హాస్పిటల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ముందు ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనులైనా చేసుకోగలుగుతారని తెలియజేశారు. అభిమానుల సంఘం సభ్యులు మాట్లాడుతూ ఇప్పటివరకు 3 వేదికల మీద పండ్లు పంపిణీ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల జాతీయ సామాజిక సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు రాష్ట్ర సమన్వయకర్త కట్టెకోలె వెంకటేశ్వర్లు అభిమానుల సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు వడ్లమూడి శ్రీనివాసరావు రాయబారపు గురవయ్య వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను
# పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

వరంగల్ నగరంలోని ఇందిరా నగర్ (గరీబ్ నగర్) జిడబ్లుఎంసి 16వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం ఎంతవరకు పూర్తయ్యింది, ఇప్పటివరకు ఎంతమేర నిధులు విడుదలయ్యాయి అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.





ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 20 నుండి 26 వరకు సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించనున్న నేపథ్యంలో, లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టర్ వెంట ఇందిరమ్మ ఇళ్ల జిల్లా నోడల్ అధికారి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, హౌసింగ్ డి.ఇ. విష్ణువర్ధన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఏరియా ఐయన్టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ బాజీ సాహెబ్




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి ఏరియా సింగరేణి కోల్ మైన్స్ లేబర్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ లేబర్ యూనియన్ -ఐయన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.కె బాజీ సాహెబ్‌ని నియమిస్తూ నియామక పత్రాన్ని ఐయన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ జనక్ ప్రసాద్ అందజేశారు. సత్తుపల్లి ఏరియాకు వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా షేక్ బాజీ సాహెబ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా గౌరవ అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డికి, అధ్యక్షులు జనక్ ప్రసాద్‌కి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కి, జనరల్ సెక్రెటరీ ధర్మపురికి, రీజినల్ ఇంచార్జ్ ఆల్బర్ట్‌కి, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.